క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానం వద్ద స్థానిక శ్రీరామానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. పట్టణ సీఐ పి.వీరబాబు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రారంభం సందర్భంగా ద్వారంపూడి బాల మురళీ శ్రీనివాసరెడ్డి సహకారంతో భక్తులకు, బాటసారులకు తొలిరోజు కొబ్బరి బొండాలు పంపిణీ చేసి దాహార్తి తీర్చారు. అనంతరం చారిటబుల్ ట్రస్ట్, దేవస్థానం ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సీఐ వీరబాబును దేవస్థానం తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు చిక్కం సుబ్బారావు, ఆకుల రాము, దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్యనాయుడు, మాజీ కౌన్సిలర్ తిక్కిరెడ్డి నేతాజీ, ఉత్సవ కమిటీ సభ్యులు యర్రంశెట్టి మూర్తి, అరెగిల చంద్రశేఖర్, ముత్యాల గంగాధర్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

అల్లవరం: గుండెపూడి పోతులవారిపేటలో రెండు కిడ్నీలు పాడై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సురేష్‌కు గుడ్ సీడ్ ఫౌండర్ అధినేత, వైఎస్సార్ సీపీ నాయకులు కుంచే రమణరావు సమకూర్చిన రూ. 25 వేల చెక్కుని సాధనాల శ్రీను చేతుల మీదుగా శుక్రవారం అందించారు. ఆర్థిక సాయం అందజేసిన గుడ్ సీడ్ అధినేతకు సురేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, పినిమాల విక్రమ్, పోతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరుద్ర నక్షత్ర పూజలు

ఉప్పలగుప్తం: భీమనపల్లిలో బాల త్రిపుర సుందరీ సమేత అనంగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయ ఈవో కె.కార్తీక, వరదా శ్రీరామచంద్రమూర్తి సమక్షంలో మహాశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వెలువలపల్లి వెలువలపల్లి వెంకటసూర్యసత్యనారాయణ శర్మ ఉదయం నుంచి స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

రోబోటిక్ సాంకేతికతపై శిక్షణ తరగతులు

యానాం: జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా అటల్ ఇంక్యుబేషన్ సెంటర్, పాండిచ్చేరి ఇంజినీరింగ్ కళాశాల ఫౌండేషన్, జిల్లా పరిశ్రమల కేంద్రం డైరెక్టరేట్ ఆఫ్ హయ్యర్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషనల్ ఎడ్యుకేషన్ సంస్థలు సంయుక్తంగా స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వృత్తి నైపుణ్య తరగతుల్లో భాగంగా రోబోటిక్ టెక్నాలజీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ఎస్ నవీన్‌రాజ్, ఎస్ నరేన్‌సుబ్రహ్మణియన్ మాట్లాడుతూ వర్తమాన కాలంలో ఇది అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రంగమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, కోఆర్డినేటర్ ఏవీవీఎస్ మూర్తి, జ్యోతి, డాక్టర్ టి ముత్యాలు, కె రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తీరప్రాంత రక్షణ కవచం మడ అడవులు

యానాం: ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీర ప్రాంత గ్రామాలకు రక్షణ కవచంలా మడ అడవులు ఎంతగానో ఉపకరిస్తున్నాయని స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ విభాగ అధ్యాపకుడు జేవీ సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో బోటనీ విభాగ విద్యార్థులతో అంతర్వేది సాగర సంగమం విజ్ఞాన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్వేది వద్ద మాంగ్రూవ్ ఫారెస్ట్ ప్రాంతాలను వారు పరిశీలించారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రవేశ ఉత్సవాల సందడి

యానాం: నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం భీమ్‌నగర్ జగ్జీవన్‌రామ్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ప్రవేశ ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం స్కూల్లోనూ ప్రవేశ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు

అమలాపురం రూరల్: వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్య సిబ్బందికి అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు ఆదేశించారు. పేరూరులో శుక్రవారం ఆయన పర్యటించారు. గతంలో డెంగీ జ్వరాలు ప్రబలిన కొంకాపల్లి ప్రాంతాన్ని ఆయన సందర్శించి, వ్యాధులు ప్రబలడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ రామారావు, ఎంపీహెచ్ఈఓ సత్యనారాయణ, సూపవేజర్ కామేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. బండారులంక పీహెచ్‌సీ పరిధిలోని రెడ్డిపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పాల్గొన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ డి. ఆనంద శేఖర్, ఎంఎల్ హెచ్‌పీ చంద్రజ్యోతి, వీహెచ్ఎస్ విజయ పాల్గొన్నారు.

ప్రమాదాల బైపాస్

- వంతెనల నిర్మాణం, రోడ్ల విస్తరణపై నిర్లక్ష్యం
- ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న చోట్ల ప్రమాదాలు
- రాకపోకలకు వాహనదారులకు ఇక్కట్లు



అమలాపురం పేరూరు బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన క్రాస్‌లైన్స్



కామనగరువులో బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో కానిస్టేబుల్



అమలాపురం బైపాస్ రోడ్డులో కామనగరువు వద్ద ప్రమాదాలు జరిగే ప్రాంతంలో ఏర్పాటు చేసిన జిగ్‌జాగ్ బారికేట్లు

అమలాపురం రూరల్: జాతీయ రహదారి 216లో అమలాపురం నుంచి ముమ్మిడివరం మీదుగా నిర్మించిన బైపాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. 216 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అమలాపురం పట్టణాన్ని ఆనుకుని గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో పేరూరు నుంచి భట్నవెల్లి వరకు బైపాస్ రోడ్డు నిర్మించారు. భట్నవిల్లి, కామనగరువు, చిందాడగరువు, రోళ్లపాలెం, పేరూరు గ్రామాల నుంచి బైపాస్ రోడ్డు నుంచి అమలాపురం పట్టణంలోకి వచ్చేందుకు మూడు ప్రాంతాల్లో కనెక్టివిటీ రోడ్లు ఉన్నాయి. ఐదు కిలోమీటర్ల పరిధిలో నాలుగు గ్రామాల వెంబడి ఈ రహదారి ఉంది. ఈ రహదారిలో ప్రతి నెలలో 10 వరకు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో కొందరు తీవ్రంగా గాయపడుతున్నారు. మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నా జాతీయ రహదారి అధికారులు, పట్టించుకోవడం లేదు.

కొన్ని చోట్ల ఇరుకుగా రహదారి

పేరూరు వై.జంక్షన్, భట్నవిల్లి వద్ద ఉన్న కనెక్టివిటీ రోడ్లు విశాలంగా ఉన్నాయి. కామనగరువు- చిందాడగరువు జంక్షన్, రోళ్లపాలెం చిట్టిగరువు, రోళ్లపాలెం ప్రధాన రోడ్డు, ఇరుకుగా ఉంది. ఇక్కడ రోడ్ల విస్తరణ చేయలేదు. ఇక్కడ రోడ్డు గోతులు పడి అధ్వానంగా మారింది. భట్నవిల్లి, పేరూరు వై.జంక్షన్ దాటిన తర్వాత పట్టణంలోకి రావాలన్నా, పట్టణాన్ని ఆనుకుని ఉన్న గ్రామాలకు వెళ్లాలన్నా వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తరచూ ప్రమాదాలు

బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడే చిన్న వంతెనలు నిర్మించాల్సి ఉంది. కామనగరువు ఆమని ఆటో మొబైల్స్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కామనగరువు- చిందాడగరువు వెళ్లాలంటే బైపాస్ రోడ్డును దాటుకుని వెళ్లాల్సిందే. చిందాడగరువు, రోళ్లపాలెం, పేరూరు వై.జంక్షన్లు దాటుకుని ఆయా గ్రామాలకు వెళ్లాలి. ఇలాంటి చోట్ల రహదారిలో వంతెన నిర్మాణం చేయవలసి ఉంది. ఇటీవల అమలాపురం నుంచి బైపాస్ రహదారి మీదుగా ఆటోమొబైల్స్ వద్ద కాకినాడ వెళ్లేందుకు ఓ కారు మలుపు తిరిగింది. ఇంతలోనే ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొని కారు నుజ్జయింది. కారులో ఉన్న ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. రోళ్లపాలెం వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని వ్యాను ఢీకొని ఒకరు మృతి చెందారు. 2023లో వ్యాన్ ఢీకొని మోటార్ సైకిల్‌పై వెళుతున్న అమలాపురానికి చెందిన భార్యభర్తలు మృతి చెందారు. భట్నవిల్లి నుంచి పేరూరు వరకు బైపాస్ రహదారి ప్రమాదాలకు కేంద్రంగా మరిందిి.

సీసీ కెమెరాలు, జిగ్‌జాగ్ బారికేట్ల ఏర్పాటు

కామనగరువు ఆమని ఆటోమొబైల్స్ వద్ద తరచు జరిగే ప్రమాదాలపై పోలీసు, రవాణా శాఖ, ఎన్‌హెచ్ అధికారులు దృష్టి పెట్టారు. కామనగరువు వంతెన వద్ద సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు జిగ్‌జాగ్ బారికేట్లు ఏర్పాటు చేశారు. ఒక కానిస్టేబుల్‌ను ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసి ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారు. భట్నవెల్లి బైపాస్ రోడ్డు ప్రమాదాల కారణంగా కనెక్టివిటీ వద్ద స్పీడ్ బ్రేకర్లను తొలగించారు. భట్నవెల్లి వనువులమ్మ ఆలయం, పేరూరు వై జంక్షన్, ఆమని ఆటోమొబైల్స్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

216 జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలు సంభవించడానికి గల హాట్ స్పాట్లను గుర్తించి వాటి నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జిల్లా రహదారి భద్రత కమిటీ సభ్యులను ఆదేశించారు.దీంతో ప్రమాదాలు పొంచి ఉన్న ప్రాంతాలను అధికారులు గుర్తించి వాటి నివారణ చర్యలు చేపట్టారు. ప్రమాదాలు ఎక్కువ జరిగే ప్రాంతాల్లో అధికారులు బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటిపై దృష్టి సారించారు. రహదారుల్లో బారికేట్లు ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారుల్లో అవసరమైన వేగ నియంత్రణకు సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంచి ప్రమాదాలను తగ్గించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. 2024లో ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 117 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. రోడ్డు నిర్మాణంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై రవాణా, పోలీస్, ట్రాఫిక్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులు, శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించి ప్రమాదాలు జరగకుండా అవసరం మేరకు స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. పేరూరు, కామనగరువు, ముమ్మిడివరం జంక్షన్ల వద్ద రహదారి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టారు.

ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుల్ ఏర్పాటు



జాతీయ రహదారి 216 అమలాపురం బైపాస్ రోడ్డులో డీఎస్పీ ప్రసాద్, డీటీవో శ్రీనివాసరావు, అధికారులతో కలసి క్షేత్ర పరిశీలనలో ప్రమాదాలకు కారణాలను గుర్తించాం. కామనగరువు ఆమని ఆటోమొబైల్స్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నాం. వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు జిగ్‌జాగ్ బారికేట్లు ఏర్పాటు చేశాం. ఒక కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయడంతో ప్రమాదాలను చాలావరకూ నివారించాం.

– ప్రశాంతకుమార్ అమలాపురం రూరల్ సీఐ

వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం



అమలాపురం వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరించిన పండితులు, అర్చకులు

అమలాపురం టౌన్: కోనసీమలో పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు దేవస్థానం అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అర్చకులు శుక్రవారం ఉదయం శ్రీకారం చుట్టారు. ఈనెల 4 నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించే ఈ కల్యాణోత్సవాల్లో తొలి రోజు స్వామి, అమ్మవార్లను శాస్త్రోక్తంగా పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా ముస్తాబు చేశారు. శుక్రవారం ఉదయం 9.54 గంటలకు స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా పండితులు అలంకరించారు.మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఈ తంతు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల నుదటన కల్యాణ తిలకం దిద్ది, బుగ్గన చుక్కలు తీర్చి దిద్ది ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా మహిళలు పసుపు కొమ్ములను రోలులో వేసి రోకళ్లతో దంచారు. దేవస్థానం ప్రధాన అర్చకులు పెద్దింటి లక్ష్మీ నరసింహాచార్యుల పర్యవేక్షణలో వేద పండితులు కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి కల్యాణోత్సవాలకు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేవస్థానం ప్రాంగణమంతా ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల నీడలో భక్తులు కొంత సమయం సేద తీరుతున్నారు.

రైతులకు సాంకేతిక అంశాలను వివరించాలి

ముమ్మిడివరం: వ్యవసాయంలో రైతులకు సాంకేతిక అంశాలపై సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఏరువాక కేంద్రం సిబ్బంది సంసిద్ధులు కావాలని ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం డైరక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్సన్ డాక్టర్ శివన్నారాయణ సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో శుక్రవారం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర గిరిజారాణి అధ్యక్షతన నిర్వహించిన అమలాపురం ఏరువాక కేంద్రం జిల్లాస్థాయి సమన్వయ సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏరువాక కేంద్రం విధులను వివరించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ మాట్లాడుతూ గతేడాది చేపట్టిన సాంకేతిక కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ్యులకు వివరించారు. రైతుల సందేహాలను వరి ప్రధాన శాస్త్రవేత్త గిరిజారాణి నివృత్తి చేశారు.

ఘనంగా ఉమాపార్వతి మల్లేశ్వర స్వామి శాంతికల్యాణం

అల్లవరం: దేవగుప్తంలో కొలువైయున్న ఉమాపార్వతి సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న నక్షత్ర పూర్వక, నవగ్రహ సహిత శివ పంచాయతన యాగం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆది దంపతులకు శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మరువాడ వంకటేశ్వర శర్మ పర్యవేక్షణలో పోచినపెద్ది శ్యామ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాగంలో ఐదవ రోజున పోచినపెద్ది నరసింహమూర్తి దంపతులతో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. దేవగుప్తం పరసర ప్రాంతాల భక్తులు హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

ఇద్దరు బెల్ట్ షాప్ నిర్వాహకుల అరెస్ట్

అమలాపురం రూరల్: అనధికారంగా మద్యం విక్రయిస్తున్న గూడాలకు చెందిన కొమ్ములు వీరబాబు, అమలాపురం సాకుర్రు చెందిన చెందిన బి.నరసింహమూర్తి వద్ద నుంచి నాలుగు సీసాలు చొప్పున ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేశారు. అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామానికి చెందిన దొమ్మేటి వెంకటప్రవీణ్‌ను అమలాపురం మండల తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు అమలాపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు.

విద్యార్థినులకు ఓవర్ కోట్స్ అందిస్తాం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలకు తమ వస్త్రాలపై ధరించేలా వచ్చే విద్యాసంవత్సరం ఓవర్ కోట్స్‌ను సమకూరుస్తున్నట్లు శుక్రవారం విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం తెలిపారు. 2021-22 విద్యాసంవత్సరంలో 225 మందికి నీట్ పరీక్ష శిక్షణనిచ్చినట్లు తెలిపారు. వీరిలో 21 మంది మెడికల్ కోర్సులకు అర్హత సాధించారన్నారు. యూనిఫామ్, పుస్తకాలు, సైకిళ్లు, ల్యాప్‌టాప్, అధునాతన తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్స్ వంటి వాటిని అన్ని పాఠశాలల్లో సమకూర్చినట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా రుద్ర హోమం

ఐ.పోలవరం: చైత్ర మాసం ఆరుద్ర నక్షత్రం మహా పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో రుద్ర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. తొలుత గణపతి పూజ, మండపారాధన, రుద్ర హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం రోజున ప్రతి నెల ఆలయంలో రుద్ర హోమం నిర్వహిస్తారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

పట్టు వస్త్రాల సమర్పణ

మురమళ్లలో నూతనంగా పునఃప్రతిష్ఠ చేసిన సీతారామచంద్ర పరివారానికి శుక్రవారం వీరేశ్వర స్వామి దేవస్థానం అధికారులు పట్టు వస్త్రాలు సమర్పించారు. గ్రామస్తుల సహకారంతో ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. వీరేశ్వర స్వామి ఆలయం నుంచి సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ, శ్రీ దాట్ల కృష్ణంరాజు, ఆలయ పర్యవేక్షణ అధికారి శ్రీనివాస రాజు, అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు, పురోహితులతో కలసి సీతారాములవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు పోలీస్‌స్టేషన్‌లో ప్రజావేదిక

యానాం: ప్రజల సమస్యల పరిష్కారానికి శనివారం యానాం నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి ప్రజావేదిక ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తామని ఎస్పీ రాజశేఖరన్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తామని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియ కొంతకాలంగా ప్రతి శనివారం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ప్రజావేదిక కొనసాగుతుందన్నారు.

రౌడీ షీటర్లపై కేసు నమోదు

అమలాపురం టౌన్: అమలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేరూరు చర్చి పేట వద్ద పట్టణానికి చెందిన ఓ రౌడీషీటర్‌పై మరో రౌడీషీటర్ దాడి చేసిన ఘటన శుక్రవారం జరిగింది. పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం రౌడీ షీటర్ కంచిపల్లి శ్రీను హైదరాబాద్‌లోని తన మిత్రుడికి మరో రౌడీ షీటర్ పతివాడ నాగేంద్రను పరిచయం చేశాడు. హైదరాబాద్‌లోని మిత్రుడు కంచిపల్లి శ్రీనుకు ఫోన్ చేసి నాగేంద్ర తరచూ డబ్బు డిమాండ్ చేస్తున్నాడని వాపోయాడు. నాగేంద్ర ఫోన్ నంబరు బ్లాక్‌లో పెట్టమని తన మిత్రుడికి ఫోన్‌లోనే శ్రీను సలహా ఇచ్చాడు. దీంతో శ్రీనుపై అక్కసు పెంచుకున్న నాగేంద్ర అతనిపై దాడికి పాల్పడ్డాడు. పతివాడ నాగేంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

ఇద్దరిపై దాడి : స్థానిక నల్లవంతెన వద్ద ఓం ప్రకాష్‌తో పట్టణానికి చెందిన కంచిపల్లి శ్రీను ఓ బాకీ నిమిత్తమై శుక్రవారం గొడవ పడ్డాడని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఈ గొడవలో ఓం ప్రకాష్‌తోపాటు అక్కడే ఉన్న ఓ మహిళపై కంచిపల్లి శ్రీను దాడి చేసి గాయపరిచాడు. గతంలో ముమ్మిడివరంలో ఓ వ్యక్తి ద్వారా ఓం ప్రకాష్‌కు కొంత మొత్తాన్ని శ్రీను అప్పుగా ఇప్పించాడని సీఐ తెలిపారు. ఆ బాకీ తీర్చడం లేదన్న అక్కసుతో ఈ దాడి చేశాడన్నారు. గాయపడిన ఓం ప్రకాష్‌ను, మహిళను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కంచిపల్లి శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

తాగునీటి ఇక్కట్లు తీర్చాలి



గోపవరంలో ట్యాంకరుతో తాగునీటిని అందిస్తున్న సర్పంచ్ బుల్లియ్య

ఉప్పలగుప్తం: గోపవరం పంచాయతీ పరిధి రావులమ్మ చెరువుగట్టు, బెస్థాయిపేట ప్రాంతంలో ప్రజలు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ కుంచే బుల్లియ్య కోరారు. ఆ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం ట్యాంకర్ సహాయంతో తాగునీటిని ప్రజలకు అందించారు. రావులమ్మ చెరువుకు 40 కిలోలీటర్లు, బెస్థాయిపేట ప్రాంతంలో 20 కిలోలీటర్ల వాటర్ ట్యాంకుల నిర్మాణానికి గత ప్రభుత్వం హయాంలో పనులు ప్రారంభమయ్యాయి. ట్యాంకుల నిర్మాణాలు పూర్తయినా నేటికీ నుంచి నీటిని సరఫరా చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పునరంకితమవుదాం



వివిధ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్

తాళ్లరేవు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పునరంకితమవ్వాలని కోరింగ వన్యప్రాణి విభాగం ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఏపీ అటవీశాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రకృతి శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకులు పి.ప్రవంతి ఆదేశాల మేరకు ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరానికి వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యావరణాన్ని కాపాడటానికి నీటిని పొదుపు చేయాలని, చెట్లను నాటాలని, వ్యర్థాలను తగ్గించాలన్నారు. పునరుత్పాదక ఇంధనాలను ఉపయోగించాలని, పర్యావరణానికి హాని కలిగించే కార్యకలాపాలను నివారించాలని తెలిపారు. కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణంపై విద్యార్థులకు స్పృహ కల్పించడానికి ప్రకృతి శిబిరం సహకరిస్తుందన్నారు. ప్రముఖ పప్పెట్రి శిక్షకులు పిల్లి గోవిందరాజు పర్యావరణంపై పప్పెట్రీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 8 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 92 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. అనంతరం విద్యార్థులు మడ అడవుల అందాలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కె.మహేష్, కె.సిద్ధార్థ, ఎం.మధుబాబు, సీహెచ్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు ఎస్.జ్యోతి, కుసుమ, ఎంవిఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

ఐ.పోలవరం: మురమళ్లలో నూతనంగా నిర్మించిన హనుమాన్ సహిత లక్ష్మణ సమేత కోదండ రామ స్వామి ఆలయ ప్రతిష్ఠ, గణపతి జ్ఞాన సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ పూజలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పండితుల ఆధ్వర్యంలో నడింపల్లి చిన్న వెంకటరాజు వెంకటసత్యసౌజన్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భారీ చలువ పందిళ్లు నిర్మించారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

అసైన్డ్ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు



సీతారామపురంలో మట్టి తరలింపును అడ్డుకుంటున్న రైతులు

తాళ్లరేవు: మండల పరిధిలోని కోరంగి పంచాయతీ సీతారామపురంలో ఆత్రేయ గోదావరి నది చెంతన ఉన్న అసైన్డ్ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలను శుక్రవారం ప్రజా సంఘాలు, దళిత నాయకులు అడ్డుకున్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు మూడు రోజులుగా తమ భూముల్లో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారంటూ కన్నీడి వెంకటరమణ, పెనుమాల బాబా నరసింహారెడ్డి రెవెన్యూ అధికారులు, కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేసారు. అయినప్పటికీ అధికారులు స్పందించక పోవడంతో ఆయా పనులను వారు అడ్డుకుని జేసీబీలు, ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించి వేసారు. రహదారికి అడ్డంగా మట్టిని వేశారు. విషయం తెలుసుకున్న కోరంగి పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వారితో చర్చించారు. 1975లో దంప ప్రాంతంలో ఆత్రేయ గోదావరిని అనుకుని ప్రభుత్వం అందించిన ఆరు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని పెనుమాల ధర్మరాజు, కన్నీడి హంస తదితరులు తెలిపారు. 8 ఏళ్ల క్రితం గోదావరిలో డ్రెడ్జింగ్ చేసి మట్టిని తమ భూముల్లో వేసారని, దీని వల్ల వ్యవసాయం చేయలేదని వారు తెలిపారు. ఆ మట్టిని లక్ష్మణరావు అనుమతులున్నాయంటూ దర్జాగా తరలించుకుపోతున్నారని తెలిపారు. దీనిపై బాధితులు కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, దళిత నాయకులు కాశి లక్ష్మణస్వామి, వెంటపల్లి నూకరాజు, వాకపల్లి చిరంజీవి, యడ్ల కుటుంబరావు, జక్కల ప్రసాద్, దుప్పి అదృష్టదీపుడు ఉన్నారు.

జాబ్ మేళా గోడ పత్రిక ఆవిష్కరణ

అమలాపురం రూరల్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2025-2026 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ మే జూన్ మాసాలకు సంబంధించి మొదటి త్రైమాసికానికి ఏడు నియోజకవర్గాల పరిధిలో నిర్వహించనున్న జాబ్ మేళాల క్యాలెండర్ గోడ పత్రికను కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిశేషు మాట్లాడుతూ శుక్రవారం అమలాపురంలో నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహించామని తెలిపారు. ఏప్రిల్ 17న పి.గన్నవరం నియోజక వర్గంలో, మే 2న మండపేట నియోజకవర్గంలో మే 16న కొత్తపేట నియోజకవర్గంలో, మే 23న ముమ్మిడివరం నియోజకవర్గంలో, జూన్ 6న రాజోలు నియోజకవర్గంలో, జూన్ 13న రామచంద్రపురం నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. వికాస జిల్లా మేనేజర్ గొల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ కాన్పు తల్లీబిడ్డకు మేలు

అల్లవరం: సాధారణ కాన్పు తల్లీబిడ్డలకు ఎంతో మేలు జరుగుతుందని, సాధారణ కాన్పు వైపే తల్లులు మొగ్గు చూపాలని అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపర్‌టెండెంట్ సరోజిని అన్నారు. ఆస్పత్రిలో శుక్రవారం సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లిబిడ్డలు ఆరోగ్యం ఉంటారని తెలిపారు. పుట్టిన వెంటనే తల్లి నుంచి బిడ్డకు ముర్రు పాలు అందించాలన్నారు. దీని వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అమృత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

177 హెల్పర్ పోస్టులకు ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి విద్యుత్‌శాఖలో ఖాళీగా ఉన్న 177 కన్‌స్ట్రక్షన్ హెల్పర్ రెగ్యులర్ బేసిస్ (గ్రూప్-సి నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీకి ఈనెల 5 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శుక్రవారం విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజేష్‌సన్యాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీలు, అర్హతల వివరాలు, పరీక్ష విధానం, మెథడ్ ఆఫ్ సెలెక్షన్ తదితర వివరాల నోటిఫికేషన్ రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.అభ్యర్థులు యానాం, కారైకల్, మాహే, పుదుచ్చేరి నివాసితులై ఉండాలని ఏప్రిల్ 25 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన నకలును, జెరాక్స్ సర్టిఫికెట్లను జతచేసి సూపరింటెండెంట్ ఇంజనీర్ కమ్ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్‌సీ బోస్ రోడ్డు, పుదుచ్చేరి – 605001కు మే 2లోగా పంపాలని కోరారు.

ఉత్సాహంగా స్కూల్ జోనల్ గేమ్స్

యానాం: విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్ జోనల్ గేమ్స్ శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జీఎంసీ బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా అండర్-14, 17 బాలుర, బాలికలకు రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్‌తో పాటు 100, 200 మీటర్ల పరుగుపందెం, త్రో తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ నుంచి 230 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందినవారు ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించే పుదుచ్చేరి రాష్ట్రస్థాయి పోటీలకు యానాం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ఆర్గనైజింగ్ సెక్రటరీ వినకోటి సన్యాసిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు పాము సత్యనారాయణ, పాలికి ప్రకాష్, రమేష్, భాస్కర్, ఐవీకే మోహన్ పాల్గొన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

అమలాపురం టౌన్: బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక నల్లవంతెన వద్ద గల పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. ఈనెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్ద బీసీలకు 52 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పించాలన్న డిమాండ్‌తో పార్టీ తరపున నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సత్యనారాయణ వెల్లడించారు. నిరసన కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి కాశీ లక్ష్మి భవాని, ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు, ప్రధాన కార్యదర్శి బూసి జాన్ మోషే, నాయకులు పాల్గొన్నారు.

ఏడుకొండలుకు ఉగాది నంది పురస్కారం

తాళ్లరేవు: విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రపంచ శాంతి అవార్డు గ్రహీత వడ్డి ఏడుకొండలు ఉగాది నంది పురస్కారాన్ని అందుకున్నారు. శుక్రవారం రాజమండ్రిలోని ఏకేసీ రోటరీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ సాంస్కృతిక, పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, ట్రిబుల్ గిన్నీస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ గజల్ శ్రీనివాస్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కత్తిమండ ప్రతాప్, నర్సిపల్లి హారిక, గుబ్బల రాంబాబు పాల్గొన్నారు.